# కాల్పులు ఎందుకు విరమించాం !



## నగరంలో ఇదే హాట్ టాపిక్

### సోషల్ మీడియాలోనూ అదే ముచ్చట

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ అనే అంశంపై నగరవ్యాప్తంగా చర్చ జోరుగా నడుస్తున్నది. ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా అదే చర్చ... సోషల్‌మీడియా వేదికలపైనా అదే టాపిక్. ఒకరు కాల్పుల విరమణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే.. మరికొందరు సమర్థిస్తున్నారు. మరికొందరు 1971 నాటి పరిస్థితులను గుర్తు చేసుకుంటూ ఇందిరాగాంధీ ప్రస్తావన తెస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తల పరిస్థితులు ఉండడం, టీవీలు, సోషల్ మీడియాలో యుద్ధానికి సంబంధించిన అంశాలపై చర్చలు జరుగుతూ వచ్చాయి. ఒక్కసారిగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకారం తెలిపాయంటూ చేసిన ట్వీట్‌తో ప్రజలు, సోషల్‌మీడియాలో ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. ఉగ్రవాదులను తయారు చేసే ఫ్యాక్టరీగా మారిన పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ ఫండింగ్ ఇవ్వడంపైనా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. టెర్రరిస్టులను తయారు చేసే దేశానికి బుద్ధి చెప్పేందుకు సరైన సమయం వచ్చిందని, పాకిస్థాన్‌లో ఉగ్రవాది అనే వాడు లేకుండా చేసి, పాకిస్థాన్ నడ్డివిరిచే అవకాశం వచ్చిందని.. అది జరుగుతుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న క్రమంలో కాల్పుల విరమణ ప్రకటన వచ్చిందంటూ ప్రజలు మాట్లాడుకుంటున్నారు. శాంతిని కోరుకుంటూ వస్తున్న భారత్ ఈ సారి ఉగ్రవాదుల పీడను తొలగిస్తుందని భావించగా, మళ్లీ చర్చలేంటీ అంటూ.. ఒక్కొక్కరూ తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ వాటిపై చర్చించుకుంటున్నారు. కేవలం సోషల్‌మీడియానే కాదు.. ఉదయం వాకింగ్ గ్రౌండ్స్, హోటళ్లు, కూరగాయల మార్కెట్లు, ఫంక్షన్ల వద్ద కూడా ఇదే టాపిక్ జోరుగా నడుస్తున్నది.

## రేషన్ షాపులకు చేరని బియ్యం..

# ఇబ్బందుల్లో లబ్ధిదారులు

వికారాబాద్, మే 11 : ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని తింటూ చాలా మంది నిరుపేదలు జీవిస్తున్నారు. ప్రతినెలా 1 నుంచి 15 వ తేదీ లేదా 18వ తేదీ వరకు రేషన్ షాపుల్లో బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. 20వ తేదీ నుంచి నెలాఖరు వరకు బియ్యం ఆయా రేషన్ షాపులకు సరఫరా అవుతుంది. అయితే, గత కొన్ని నెలలుగా సమయానికి ప్రభుత్వం బియ్యాన్ని పలు రేషన్ షాపులను అందించడంలేదు. మే 1లోపు రావాల్సిన బియ్యం 11 రోజులు గడిచినా దాదాపు 30 షాపులకు ఇంకా అందలేదు. దీంతో చాలామంది లబ్ధిదారులు ప్రతిరోజూ షాపుల వద్దకు రేషన్ కోసం వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు. అధికారులు స్పందించి బియ్యాన్ని రేషన్ షాపులను సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.



వికారాబాద్ మండల స్టాక్ పాయింట్

# దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమస్యలు పరిష్కరించాలని విన్నవిస్తున్న దివ్యాంగుల సంఘం నేతలు

పెద్దఅంబర్‌పేట, మే 11 : దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెలిమండ్ల గోవర్ధన్ కోరారు. ఈ మేరకు ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. కొన్నేండ్లుగా కొండాపూర్ ఏరియా ఆస్పత్రి, వనస్థలిపురం ఏరియా దవాఖానల్లో దివ్యాంగుల సదరం క్యాంపులు జరుగుతుండేవని కానీ, కొన్ని నెలలుగా కొండాపూర్ హాస్పిటల్‌లో ఎలాంటి క్యాంపులు జరగడం లేదన్నారు. యూడీఐడీ కార్డులిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కొండాపూర్ హాస్పిటల్‌కు బదులుగా గాంధీ ఆస్పత్రిని చేర్చడంతో కొండాపూర్ దవాఖాన పరిధిలోని తొమ్మిది మండలాల్లోని దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గాంధీ హాస్పిటల్‌ను తీసేసి, మళ్లీ కొండాపూర్ ఆస్పత్రిలో క్యాంపులు యథావిధిగా నిర్వహించాలని కోరారు. ఆయనతోపాటు సంఘం ప్రతినిధులు నరసింహచారి, సురేశ్, ప్రణీత్ తదితరులు ఉన్నారు.

## నేడు జిల్లాకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి రాక



వికారాబాద్, మే 11 : రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేడు జిల్లాలోని పరిగి, వికారాబాద్‌లలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఆయన పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారులతో ఆదివారం మధ్యాహ్నం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ వైద్యారోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల కష్టాలు పట్టని సర్కార్

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



శేరిగూడలోని చేపల పెంపకం కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం, మే 11 : మత్స్యకారుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర సర్కార్ పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడ చేపల పెంపక కేంద్రాన్ని ఆయన సీపీఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించి మాట్లాడారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వృత్తిదారులను పట్టించుకోవడంలేదన్నారు. చేపల పెంపకం కేంద్రాన్ని కూల్చడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో ఉన్న చేపల పెంపకం కేంద్రాలను వెంటనే అభివృద్ధి చేయడంతోపాటు మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే, మత్స్యకారులు తమ సొసైటీల ద్వారా చేప పిల్లలు పెంచుకునేలా ప్రభుత్వం సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యదర్శివర్గ సభ్యులు సామెల్, జగన్, మత్స్యకార సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ, నర్సింహ, శంకర్, యాదయ్య, నర్సింహ, వెంకటేశ్, భిక్షపతి, రాఘవేందర్, సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఖాళీగా 5000 నర్సింగ్ పోస్టులు

## భర్తీ చేయకపోవడంతో ఉన్న వారిపైనే అదనపు భారం
## పని ఒత్తిడితో సిబ్బంది సతమతం

సిటీబ్యూరో, మే11,(నమస్తే తెలంగాణ): ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు నివాళిగా ప్రపంచ వ్యాప్తంగా మే 12 న 'ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని' నిర్వహిస్తారు. ఈ ఏడాది 'అవర్ నర్సెస్.. అవర్ ఫ్యూచర్..కేరింగ్ ఫర్ నర్సెస్ స్ట్రెంతెన్స్ ఎకనామిక్స్' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ప్రమాణాల ప్రకారం ఐసీయూలో 1:1 నిష్పత్తి ప్రకారం ఒక రోగికి ఒక నర్సు, హైరిస్క్ పడకల వద్ద 1:2 నిష్పత్తి ప్రకారం ఇద్దరు రోగులకు ఒక్క నర్సు, జనరల్ వార్డులో 1:5 ప్రకారం ఒక్క నర్సు ఐదు మంది రోగులకు సేవలందించాల్సి ఉంటుంది.



### 5000 ఖాళీలున్నాయి..

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 15,500 మంది నర్సులు ఉండగా, ఇంకా సుమారు 5000 ఖాళీలు భర్తీచేయాల్సి ఉంది. ఇటీవల జరిగిన బదీలీల్లో హైదరాబాద్ జిల్లా నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు అధిక సంఖ్యలో నర్సులు బదిలీ అయ్యారు. దీంతో రాష్ట్ర రాజధానిలో ఉన్న పెద్దాసుపత్రుల్లో నర్సుల కొరతవెంటాడుతున్నది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో సకాలంలో వైద్యం అందించేందుకు నర్సులు ఇబ్బంది పడుతున్నారు. అధిక పనిఒత్తిడితో సతమతమవుతున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మేల్ నర్సులు 800 మంది ఉండగా, 100 మందికి పైగా మేల్ నర్సులు హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో సేవలందిస్తున్నారు.

### రోగిని కాపాడడంలోనే ఆనందం



రోగిని కాపాడుకోవాలనే తపనతోనే బంధువులు, ఇతర సహాయకులపై కాస్త కఠినంగా ఉంటాం. రోగం నయమై సత్వరంగా కోలుకుంటే ముందుగా ఆనందించేది మేమే. సహాయకులకు ధైర్యం చెప్పడం వల్ల మా కర్తవ్యాన్ని నిర్వర్తించి నవ్వాళ్లమవుతాం. ఇంట్లో కూడా రోగుల గురించే ఆలోచిస్తుంటాం. **– సుజాత రాథోడ్, గెజిటెడ్ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెక్రటరీ**

### సంతృప్తిగా ఉంటుంది



మేల్ నర్సుగా రోగికి వైద్య సేవలందించడంలో చాలా సంతృప్తి చెందుతున్నా. అత్యవసర పరిస్థితుల్లో సేవలందించినప్పుడు ఓ ప్రాణాన్ని కాపాడమనే సంతోషం ఉంటుంది. **– పవ్వాడి రవికిరణ్, తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు**

# నేడు బుద్ధవనానికి సుందరీమణులు

సిటీబ్యూరో, మే 11, (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన పలు దేశాల పోటీదారులు సోమవారం నాగార్జునసాగర్ సమీపంలో ఉన్న బుద్ధవనాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా లంబాడా కళాకారులు వారికి లంబాడా నృత్యంతో స్వాగతం పలకనున్నారు. మహా స్థూపం వద్ద స్వాగతం అనంతరం స్థూపం కనిపించేలా ఫొటో సెషన్ ముగించుకొని, ప్రపంచ సుందరీమణులు ధ్యానం అనంతరం బౌద్ధ సన్యాసులు బైలెకుప్ప మహాబోధి నిర్వహించే పూజల్లో పాల్గొంటారు. పురావస్తు, టూరిజం ప్రతినిధి శివనాగిరెడ్డి బుద్ధవనం ప్రాముఖ్యతను వారికి వివరిస్తారు. జాతక వనం సందర్శన అనంతరం బౌద్ధ చరిత్ర గురించి కళాకారులు ఇచ్చే ప్రదర్శనను తిలకించనున్నారు. రాత్రి భోజనం అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

# అమృతలత అపురూప పురస్కారాలు



సాహిత్య రంగాల్లో కృషి చేసిన వారికి పురస్కారాలు ప్రదానం చేసిన అతిథులు

తెలుగు యూనివర్సిటీ, మే 11 : సాహిత్య రంగాల్లో కృషి చేసిన పలువురికి అమృతలత అపురూప పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రముఖ కవి, రచయిత, నటులు డాక్టర్ తనికెళ్ల భరణి ముఖ్య అతిథిగా హాజరై పురస్కారాలను అందజేసి వారి సాహిత్య కృషిని ప్రశంసించారు.

విద్యావేత్త, రచయిత్రి డాక్టర్ అమృతలత, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, సినీ నటి రోహిణి, రచయిత్రి నెల్లుట్ల రమాదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను డాక్టర్ అరుణా వ్యాస్ (అనువాదం), గంటి సుజల (నవలా రచన), ఉమా భారతి(శాస్త్రీయ నృత్యం) అంశాలలో కృషి చేసినందుకు గాను అందజేశారు. వివిధ ప్రక్రియలలో కృషి చేసిన పలువురు సాహితీవేతలకు అపురూప అవార్డులను అందజేశారు.

## సమ్మర్ క్యాంపులను వినియోగించుకోవాలి

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో శిక్షణ పొందుతున్న పిల్లల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని స్పోర్ట్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు అన్నారు. ఆదివారం సికింద్రాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్ల పార్ట్‌టైమ్ కోచ్‌లు, గౌరవ కోచ్‌లతోపాటు సంబంధిత గేమ్స్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కోచ్‌ల వారీగా పనితీరును సమీక్షించి సభ్యత్వ ఆదాయాన్ని మెరుగుపర్చాలని యాదగిరిరావు ఆదేశించారు. పీజేఆర్ స్టేడియం, ఇందిరాపార్కులో రోలర్ స్కేటింగ్ పార్ట్ టైమ్ కోచ్‌గా ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన నూర్ మహమ్మద్, కరాటే గౌరవ్ కోచ్ లక్ష్మణ్‌తోపాటుగా విజేతలు మిస్ శ్రావణ, పూజితను అభినందించారు. సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన కోచింగ్ క్యాంపులను ఉపయోగించుకునేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు.

# జైకాపై గంపెడాశలు



- మెట్రో విస్తరణలో కీలకంగా మారిన నిధుల సర్దుబాటు
- డీపీఆర్ ఆమోదం, నిధుల కేటాయింపుపై స్పందించని కేంద్రం
- జైకా నిధులతోనైనా పనులు చేపట్టేలా ప్రణాళికలు

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ అట్టహాసంగా ప్రకటించిన మెట్రో విస్తరణకు నిధుల కొరత వెంటాడుతున్నది. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మెట్రో ఫేజ్-2 పనులు పూర్తిచేస్తామని ప్రకటించినా.. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో జైకా లాంటి ఆర్థిక సంస్థలు చేసే సాయమే ప్రాజెక్ట్‌కు కీలకంగా మారనున్నది. వివిధ ఆర్థిక సంస్థలు ఇచ్చే ఆర్థిక సాయంపైనే మెట్రో విస్తరణ ప్రాజెక్టు ఆధారపడి ఉందని దీనిని బట్టి తెలుస్తున్నది. అయితే కేంద్రానికి పంపిన ఫేజ్-2 డీపీఆర్ ఇప్పటివరకు ఆమోదం పొందలేదు. దాదాపు మూడున్నర నెలలుగా డీపీఆర్ విషయంలో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం సూత్రప్రాయంగా కూడా ఆమోదించలేదు. ఒకవేళ కేంద్రం త్వరలో ఆమోదించినా నిధుల సర్దుబాటు ఎలా అనే అంశం ప్రభుత్వానికి తలకు మించిన భారంగా మారింది.

### ఆరు కారిడార్లలో..

మెట్రో ఫేజ్-2లో భాగంగా ఆరు కారిడార్లలో 116.4 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించేలా ప్రణాళికలు రూపొందించారు. ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్లు, ఆరో కారిడార్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీకి 40 కిలోమీటర్లు, నార్త్ సిటీకి మరో 44 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరించేందుకు ప్రతిపాదనలను తయారు చేయాల్సి ఉన్నది. మిగిలిన ఐదు కారిడార్ల నిర్మాణానికి అవసరమైన నివేదికలపై కేంద్రంతో మెట్రో సంస్థ సంప్రదింపులు జరుపుతున్నది. మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయంలో 48శాతం మేర జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ(మల్టీ లెటరల్) వంటి ఆర్థిక సంస్థలతో ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు.

ఇందులో మిగిలిన 7,313 కోట్లు (30శాతం) రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర వాటా రూ.4230 కోట్లు(18శాతం) మేర చేపట్టనున్నది. అయితే ఇతర ఆర్థిక సంస్థల నుంచి తీసుకునే అప్పులకు కేంద్రం గ్యారెంటీ ఇవ్వాల్సి ఉండగా, మిగిలిన 4శాతం మేర రూ. 1,033 కోట్లను పీపీపీ విధానంలో సమకూర్చి ప్రాజెక్టును చేపట్టేలా డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును హైదరాబాద్ మెట్రో సంస్థ సిద్ధం చేసింది.

### ఆర్థిక వనరులే కీలకం...

ఐదు కారిడార్లతోపాటు.. ఫోర్త్ సిటీ, నార్త్ సిటీ మెట్రో ప్రాజెక్టులన్నింటికీ ఆర్థిక వనరులే కీలకంగా మారాయి. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నిధులు కేటాయింపు ఆశలు తక్కువే ఉన్నా... ఆర్థిక సంస్థలు ప్రోత్సహిస్తే తప్పా... మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు ముందుకు కదిలే పరిస్థితి లేదు. ప్రభుత్వం కూడా నిధులను సర్దుబాటు చేస్తుందనే భరోసా లేకుండా పోయింది. అయితే కేంద్రం డీపీఆర్‌ను ఆమోదించినా... నిధుల కేటాయింపులు అనుకున్నంత త్వరగా జరిగే పరిస్థితి లేదని తెలుస్తున్నది. ఇదే గనుక జరిగితే ఇతర ఆర్థిక సంస్థలు ఇచ్చే నిధులపైనే మెట్రో విస్తరణ ఆధారపడి ఉంటుంది. దీని ఫలితంగా ప్రభుత్వం ఇదివరకు చెప్పిన గడువు తేదీలోపు మెట్రో విస్తరణ పూర్తయ్యే అవకాశాలుకనిపించడం లేదు.

# రూ. 200 కోట్ల స్థలం కబ్జా

## ఆ 3 ఎకరాలు ఎవరి చేతుల్లో..?

### స్థలం అన్యాక్రాంతం అవుతుందంటూ ఫిర్యాదుల వెల్లువ

### క్షేత్రస్థాయి పర్యటనలో కమిషనర్ కీలక ఆదేశాలు



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న బల్దియా కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): గౌలిపురా కబేళాపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ ప్రత్యేక దృష్టి సారించారు. మూతపడిన కబేళా (స్లాటర్ హౌస్)ను పునః ప్రారంభించే దిశగా కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల గౌలిపుర స్లాటర్ హౌస్ భవనాన్ని కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానికుల నుంచి వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గౌలిపుర మేకలమండి గతంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బాగా నడిచిందని, కాలనీకి చెందిన ఒక వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయిందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. స్లాటర్ హౌస్ పనిచేయకపోవడంతో ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులుపడ్డాయని, కోర్టు తీర్పు ఇచ్చి చాలా రోజులవుతున్నందున యంత్రాలు, మరమ్మతులు ఇంకా కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కమ్యూనిటీ పెద్దలు ఈ సందర్భంగా కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. బిల్డింగ్, యంత్రాల మరమ్మతులు, నీరు ఇతర వసతులు ఏర్పాటు చేసి త్వరలోనే పునః ప్రారంభిస్తామని కమ్యూనిటీ పెద్దలకు కమిషనర్ వివరించారు. వెంటనే ప్రాజెక్టు ఇంజినీర్‌కు ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ ఆదేశించారు.

### కబ్జాపై ఆరా..

గౌలిపురా కబేళాకు సంబంధించిన 4.2 ఎకరాల స్థలంతోపాటు 1961లో మరో మూడెకరాలను ఎంసీహెచ్ అధికారులు కొనుగోలు చేశారు. కానీ, ఈ మూడు ఎకరాల భూమి ఎవరి చేతుల్లో ఉందనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై కమిషనర్‌కు ఆరెకటిక సంఘం నాయకులు అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిషనర్ సమగ్ర వివరాలను ఎస్టేట్ విభాగాన్ని సమర్పించాలని ఆదేశించారు.

## నిజాం కాలం నాటి నుంచి..

హైదరాబాద్ గౌలిపురాలో నిజాం కాలం నుంచి కబేళా నిర్వహణలో ఉంది. దీనికి సంబంధించి జీహెచ్‌ఎంసీకి చెందిన 4.2 ఎకరాల స్థలంలోనే కబేళా నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని కారణాలతో 2003లో హైకోర్టు ఆదేశాలతో గౌలిపురా కబేళా మూతపడింది. అప్పటి నుంచి ఈ స్థలాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని కొందరు కన్నేశారు. కబ్జాదారులకు రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు కొందరు వంతపాడడంతో రూ.రెండు వందల కోట్ల విలువైన స్థలాన్ని కొట్టేశారు. గౌలిపురలోని 4.2 ఎకరాల భూమిని 2010లో హైదరాబాద్ జిల్లా అప్పటి కలెక్టర్ నవీన్‌మిట్టల్ ప్రైవేట్ వ్యక్తులకు మ్యుటేషన్ చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ భూమి తమదని కోర్టును ఆశ్రయించారు. తర్వాత హైదరాబాద్ కలెక్టర్‌గా వచ్చిన గుల్జార్ గౌలిపురా భూమి మ్యుటేషన్‌ను రద్దు చేసి ప్రభుత్వానికి చెందినదిగా ప్రకటించారు. అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. దీనిపై పలువురు కోర్టును ఆశ్రయించారు. అయితే ప్రభుత్వ నిర్ణయంతో అక్కడ రూ. 7 కోట్లతో రాంకీ సంస్థ మోడ్రన్ కబేళాను నిర్మించింది. ఈ నేపథ్యంలోనే కబేళాను ప్రారంభిస్తామని చెప్పిన కమిషనర్.. కబ్జాకు గురైన స్థలం విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.